# ఆశలో ఆ



చిన్నకోట సుశీలాదేవి

గుడి మెట్లమీద కూర్చున్న బిచ్చగాళ్లకు డబ్బులు వేస్తూ, మెట్లు దిగుతున్నారొక జంట! బిచ్చగాళ్ల వరుసలో కూర్చున్న రాఘవ ఆ జంట వంకే కన్నార్పకుండ చూస్తున్నాడు.

ఆమె ... ఎవరు...అచ్చు మాధవిలానే వుందే! ఆనడక, విశాలమైన కళ్లు... ఎడమ బుగ్గమీద నల్లటి పుట్టుమచ్చ... మాధవే!

ఆమె ప్రక్కన సూటు, బూటులో ఆ వ్యక్తి ఎంతో అందంగా వున్నాడు. ఆ వ్యక్తి చేతిలో బాబు ...

అయితే మాధవి మళ్లీ పెళ్లి చేసుకుందా! ఆ ఆలోచన రాఘవ మనసులో సన్నటి మంట రేపింది.

తనెంత నికృష్ట జాతకుడు! తన అదృష్టమే బాగుంటే ఆ వ్యక్తి స్థానంలో తానుండేవాడు. అలా మాధవి ప్రక్కన నడుస్తూ ఆమెతో కబుర్లు చెప్తూ ఎంతో హాయిని అనుభవించేవాడు.

కాని విధివ్రాతని ఎవరు తప్పించగలరు? రాఘవ చిన్నగా నిట్టూర్చాడు.

ఆమె దగ్గరికి వచ్చేస్తోంది! తన ముఖం ఆమెకి చూపించడం ఇష్టంలేక తలొంచుకున్నాడు రాఘవ.

అయినా తన పిచ్చిగానీ, మాధవి తనని ఎలా గుర్తుపడుతుంది! తనెంతో మారిపోయాడు! తనని తాను చూసుకున్నాడు! దుఃఖం పొంగుకు వచ్చింది.

"ఏయ్! అబ్బీ! చెయ్యి పట్టు!"

రాఘవ ఉలిక్కిపడ్డాడు! ఎదురుగా ఎర్రచీర... జరీ అంచు పచ్చటి పాదాలమీద జీరాడుతోంది.

అప్రయత్నంగా చెయ్యి చాపాడు.

చేతిలో అయిదుపైసల నాణెం పడింది.

"పాపం కాలు, చెయ్యీ లేదు." ప్రక్కనున్న వ్యక్తి మాధవితో అంటున్నాడు.

"ప్చ్!" మాధవి జాలిపడింది.

వాళ్లు ముందుకు సాగిపోతున్నారు! వాళ్ల మాటలు సన్నగా వినిపిస్తున్నాయి.

రాఘవకి తనమీద తనకే అసహ్యం కలిగింది. తాను ఇంకా ఎందుకు బ్రతికున్నాడు! ఏ కోరిక తీరాలని! ఏ ఆనందం అనుభవించాలని! తను జీవించడం వ్యర్థం.

రాఘవ తలెత్తి చూశాడు.

మాధవి మెట్లక్రింద అదృశ్యమైంది!

ఇన్నాళ్లూ తనకి ఒకేకోరిక వుండేది! మాధవిని ఒక్కసారి చూస్తే చాలు అనుకునేవాడు. ఆమె నవ్వుతూ, జీవితం గడుపుతూంటే కళ్లారా చూడాలని ఆశపడుతుండేవాడు.

ఇన్నాళ్లకి ఆమెని చూశాడు! తన కోరిక తీరింది.

కానీ ఎందుకో సంతోషం లేదు, తృప్తిలేదు! గుండెల్లో ఏదో ఆవేదన ...

మాధవి తనమాటే మర్చిపోయి హాయిగా వుంది అందమైన భర్త, చక్కటి బాబుతో ఎంతో సుఖంగా జీవిస్తోంది.

మీరు లేకపోతే నేను బ్రతకలేనండీ ... 'కలిసి జీవిద్దాం! కలిసి మరణిద్దాం'... అన్న మాధవేనా! స్త్రీల ప్రేమ ఇంత క్షణికమా!

తానిప్పుడు మాధవి దగ్గరికెళ్లి ... "నేను నీ రాఘవని" అంటే ఏం చేస్తుంది!

అసహ్యించుకుంటుందా! ఆదరిస్తుందా? అయినా తనే కదా అన్నిటినీ వదులుకుంది! మాధవి సుఖంకోరే తనిలా వచ్చేశాడు! అటువంటప్పుడు మాధవి హాయిగా వున్నందుకు సంతోషించాల్సింది పోయి తనెందుకిలా బాధపడుతున్నాడు.

మాధవి తనకోసం ఏడుస్తూంటే బాగుంటుందా?...

రకరకాల ఆలోచనల్తో రాఘవకి బుర్ర తిరుగుతున్నట్లుగా అన్పించి వెనక్కి జారగిలబడి కూర్చున్నాడు.

తనకీ స్థితి రాకుండా వుంటే ...

అసలారోజు ఏ దుర్ముహూర్తాన బయలుదేరాడో కానీ ... ఆ భయంకరమైన రాత్రి ...తన కలలన్నిటినీ సమాధి చేసిన రాత్రి ...

ఆనాటి సంఘటన అతని కళ్లముందు మెదిలింది.

అవి రాఘవకి కొత్తగా పెళ్లయిన రోజులు. పండక్కి అత్తవారింటికి బయలుదేరాడు! రైలు కంటె వేగంగా పరిగెడుతోంది అతని మనసు.

ఎప్పుడెప్పుడు మాధవిని చూద్దామా అని అతని హృదయం ఆరాటపడుతోంది.

మాధవికి ఇష్టమని జరీఅంచు తెల్లచీర కొన్నాడు! ఆ చీరలో అందమైన మాధవి ఇంకెంత మెరిసిపోతుందో! తలుచుకుంటుంటేనే మనస్సు స్వాధీనం తప్పతోంది! నిజంగా ఆ క్షణాలు అనుభవానికి వస్తే ... ఆ అనుభూతి ఊహకు అందటం లేదు.

'రైలు చాలా నెమ్మదిగా వెడుతోందే' అనుకున్నాడు. అప్రయత్నంగా ఆమాటలే పైకి అనేశాడు.

ఎదుటి సీటులోని ముసలాయన ఆ మాటలకి నవ్వుతూ! "అత్తారింటికి వెడుతున్నావా బాబూ!" అనడిగాడు.

రాఘవ సిగ్గుతో తల పక్కకి తిప్పుకున్నాడు.

కిటికీలోనుండి చల్లగాలి ... మాధవి చేతి స్పర్శలా మెత్తగా తగులుతోంది. మెల్లగా కళ్లు మూసుకున్నాడు. మగతలోకి జారాడు.

ఏవేవో కేకలు... ఏడుపులు విన్పించడంతో మెలకువ వచ్చింది.

రాఘవ కళ్లు తెరిచాడు! రైలు ఒక ప్రక్కకి ఒరిగిపోయింది. ఎదుటిసీటులోని ముసలాయన వేసిన కేకకి పెట్టె అదిరిపోయింది.

తానేదో అఘాతంలోకి పడిపోతున్నట్లన్పించింది రాఘవకి! తూలి పక్కకు పడ్డాడు ... అంతే ... తిరిగి కళ్లు తెరిచేసరికి తెల్లటి గోడలు... చకచకా తిరిగే నర్సులు ... కన్పించారు.

ఇదేమిటి! హాస్పిటల్‌లా వుందే ... తనిక్కడ వున్నాడేమిటి! అనుకుంటూ లేవబోయాడు రాఘవ.

కానీ నడుం పట్టేసింది.

"అమ్మా!" అంటూ బాధతో మూలిగాడు.

నర్సు పరుగున వచ్చింది.

"లేవకండి! కుట్లు కదుల్తాయి!" రాఘవని జాగ్రత్తగా పడుకోబెట్టింది.

రాఘవ శరీరం వైపు చూసుకున్నాడు! చేతులకు కాళ్లకు బాండేజి కన్పించింది.


"సిస్టర్! నాకేమయింది?" భయంభయంగా అడిగాడు!

"రైలు ప్రమాదం జరిగింది సార్! అదృష్టవంతులు కాబట్టే ప్రాణాల్తో బయటపడ్డారు! మీకు బాగా రెస్టు కావాలి! కదలకండి!" అని చెప్పి వెళ్లిపోయింది.

రాఘవ ఆలోచిస్తూ పడుకున్నాడు.

కొద్దికొద్దిగా జ్ఞాపకం వస్తోంది! తను ఏలూరు వెళ్లాలని, రైలెక్కాడు. మధ్యలో ఈ ప్రమాదం జరిగింది!

# బంధం



తను హాస్పిటల్లో చేరి ఎన్నిరోజులైందో! అమ్మా, నాన్నగారు, ముఖ్యంగా మాధవి... తనని గూర్చి ఎంత కంగారు పడుతున్నారో! తనని త్వరలో డిశ్చార్జి చేస్తే బాగుండును! వాళ్లందర్నీ చూడాలని వుంది! అనుకున్నాడు రాఘవ.

అయిదోరోజు కుట్లు విప్పారు. అప్పుడు తెలిసింది రాఘవకి అసలు స్థితి! ఒక కాలు, చెయ్యిలేదు. రాఘవ గుండె బ్రద్దలైంది! నిజాన్ని తట్టుకోలేక స్పృహ కోల్పోయాడు.

ఆ మర్నాడు రాఘవకి ఇంజక్షనిస్తూ — "మీదేవూరు! మీ వివరాలు చెప్పండి. మీ వాళ్లకి వుత్తరం రాస్తాం!"అన్నాడు.

ఆ ప్రశ్నతో రాఘవ ఉలిక్కిపడ్డట్టయ్యాడు. తన వాళ్లా!

వాళ్ళు తన స్థితిచూసి తట్టుకోగలరా!

తనపైనే ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లీ, తండ్రీ ... మాధవి ...తను కుంటివాడని తెలిస్తే ఏమయిపోతారు! తను వాళ్లదగ్గరికి వెళ్లలేడు! వెళ్లి వాళ్లకు భారంగా వుండలేడు.

తను రైలుప్రమాదంలో మరణించాడని తెలిస్తే ఒక ఏడుపు ఏడిచి వూరుకుంటారు.

మాధవికి పెళ్లయి రెండు నెలలే అయింది కాబట్టి మళ్లా వివాహం జరగొచ్చు!

తానిప్పుడు ఇలావెడితే అమ్మా, నాన్నాలకి — మాధవికి ఒక గుదిబండలా తయారవుతాడు! కాబట్టి తను మళ్లీ వెళ్లకపోవడమే మంచిది.

ఇలా ఆలోచించి చివరికి డాక్టరు ఇచ్చిన కర్రలతో విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టాడు.

"ఏరోయ్! నిద్దరోతన్నావా! లే! పోదాం!" తోటి బిచ్చగాడు తట్టి లేపడంతో కళ్లు విప్పి చూశాడు రాఘవ!

బాగా చీకటి పడింది.

చెట్ల చాటునుండి చంద్రుడు రానా, వద్దా అంటున్నాడు.

రాఘవ మెల్లగాలేచి కర్రసాయంతో అడుగులు వేస్తున్నాడు.

దూరంగా మండపంపైన ఇద్దరు వ్యక్తులు లీలగా కన్పించారు.

'వాళ్లేనా! ఏమో!' అనుకుంటూ తలొంచుకుని గబగబా మరో ప్రక్కకు అడుగులేశాడు రాఘవ!

ఆ క్షణంలో మాధవి తన ప్రక్కన కూర్చున్న వ్యక్తితో అంటోంది —

"అన్నయ్యా! ఏనాటికైనా నా కోరిక తీరుతుందంటావా!"

చెల్లెలిపై జాలి పడ్డాడతను.

"మాధవీ! నామాట విని మళ్లీ పెళ్లిచేసుకో! మూర్ఖంగా ఆలోచించి జీవితాన్ని పాడుచేసుకోకమ్మా!"

అతని మాటలకు మాధవి చిన్నగా నవ్వింది!

"అన్నయ్యా! అదంత సులభంకాదు. నువ్వొక్కసారి ఆయన్నిచూస్తే ఆయనెంత మంచివాడో నీకు తెలిసేది! ఆయనతో నేను గడిపింది కొద్దికాలమే! అయితే ఏం ఆయన పోలికల్తో పుట్టిన ఈ బాబు నాకు చాలన్నయ్యా! వీడిని చూసుకుంటూ ఈ జన్మకింతేనని సరిపెట్టుకుంటాను." కనుకొలకుల్లో నిలచిన నీటిని కొంగుతో తుడుచుకుంది మాధవి!

"అన్నయ్యా! ఆ రైలు ప్రమాదం జరిగినప్పుడు ఆయన్ని ఏ హాస్పిటల్లో జాయిన్ చేశారో మాకు చాలా ఆలస్యంగా తెలిసింది. తీరా మేము వెళ్లేసరికి ఆయన్ని డిశ్చార్జి చేసేసారుట! ఆయన తనకెవరూ లేరనిచెప్పి వెళ్లిపోయారుట! కుంటివారైనంత మాత్రాన గుండెల్లో ప్రేమ ఏమవుతుంది? ఆయన చాలా తెలివితక్కువగా ఆలోచించారన్నయ్యా! అమ్మా, నాన్నగారు నా బాధని అర్థం చేసుకోలేదు! సమయానికి నువ్వు కెనడా నుండి వచ్చావు. నన్నర్థం చేసుకుని — నాతో దేశం తిరుగుతున్నావు!"

క్షణం ఆగి అంది —

"అన్నయ్యా! ఆయన ఎప్పటికైనా కన్పిస్తారు! నాకా నమ్మకం వుంది!"

వెన్నెల్లో ఆమె చెంపలమీద కన్నీళ్లు ముత్యాల్లా మెరుస్తున్నాయి

"ఏమోనమ్మా! నీ సమస్యకి కాలమే పరిష్కరించాలి!" అన్నాడతను, కూర్చున్న చోటినుండి లేస్తూ!

మాధవి కూడా బాబునెత్తుకుని లేచింది.

ఇద్దరూ ఇంటిదారి పట్టారు...